సాక్షి కామారెడ్డి

బుధవారం, 30, ఆగస్టు, 2023



అవి బీఆర్ఎస్ తీర్మానాలు

కేసీఆర్‌కే ఓటేస్తామని బీఆర్ఎస్ నేతలే తీర్మానాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

- 9లో ▸



దూసుకుపోతున్నాం

జుక్కల్ నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.3 /21.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మద్దెల చెరువు మద్యం దుకాణానికి లక్కీడ్రా



కామారెడ్డి క్రైం: పిట్లం మండలంలోని మద్దెల చెరువు వైన్‌షాప్(షాప్ నెంబర్ 48)నకు మంగళవారం కలెక్టరేట్‌లో లక్కీడ్రా నిర్వహించారు. రంగు శ్రావణ్ కుమార్‌కు అదృష్టం దక్కింది. 2023–25 నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. 48వ నంబర్ దుకాణానికి రెండే దరఖాస్తులు రావడంతో ఆ దుకాణానికి డ్రా నిలిపివేశారు. మిగిలిన దుకాణాలకు ఈనె ల 21న లక్కీడ్రా నిర్వహించారు. అనంతరం మద్దెల చెరువు దుకాణానికి ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. 32 దరఖాస్తులు వచ్చాయి. దుకాణం కేటాయింపు కోసం మంగళవారం కలెక్టరేట్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ లక్కీడ్రా తీశారు. సికింద్రాబాద్‌లోని లాలాపేట్‌కు చెందిన రంగు శ్రావణ్ కుమార్ కు అదృష్టం వరించింది. శ్రావణ్‌కుమార్ ఒకే దరఖాస్తు వేయడం విశేషం. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు, ఆబ్కారీ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వ్యావహారిక భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిష్టయ్య మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి కృషి వల్ల సామాన్యులకు అర్థమయ్యే భాషలో రచనలు వచ్చాయన్నారు. మాతృభాషను మరువవద్దని కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు శంకర్ కోరా రు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, పరీక్షల నియంత్రణ అధికారి రామ కృష్ణ, తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు దత్తహరి, కళాశాల అధ్యాపకులు లెఫ్టినెంట్ రామస్వామి, శ్రీనివాసరావు, లక్ష్మణాచారి, శ్రీవేణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి'



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కలెక్టర్‌ను కోరారు. ఆయన ఈ విషయమై మంగళవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎల్లారెడ్డిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 10 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు టెండర్లు పూర్తై ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించలేదన్నారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై కఠిన చర్య లు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ భూంగారి రాము తదితరులున్నారు.

నవోదయ ప్రిన్సిపల్‌గా సత్యవతి



నిజాంసాగర్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్‌గా సత్యవతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ బదిలీ అయిన సంగతి తెలిసిందే.


బండ భారం తగ్గింది..



సుభాష్‌నగర్ : గృహోపయోగ గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సిలిండర్‌పై రూ. 200, అలాగే ఉజ్వల యోజన పథకం వినియోగదారులకు రూ. 400 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా ప్రజలపై రూ. 13.70 కోట్ల వరకు భారం తగ్గనుంది. కేంద్రం నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో కసరత్తు!

కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతోంది. ఆశావహులనుంచి వచ్చిన దరఖాస్తులను పీఈసీ పరిశీలిస్తోంది. పోటీలేని చోట ముందుగా అభ్యర్థులను ప్రకటించాలని ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



- దరఖాస్తులను వడబోస్తున్న పీఈసీ సభ్యులు
- వచ్చేనెల 2న అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం

పోటీ లేని చోట ముందుగానే వెల్లడి

రాష్ట్రవ్యాప్తంగా టికెట్లు కోసం పెద్దగా పోటీ లేని నియోజకవర్గాలలో ముందుగా అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీతో పాటు మరొకరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ బలమైన అభ్యర్థి షబ్బీర్ అలీ కావడంతో తొలి జాబితాలో ఆయన పేరు చేర్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం టికెట్టు నలుగురు ఆశిస్తున్నా.. పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డిల మధ్య టికెట్టుకోసం తీవ్ర పోటీ ఉంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. అయితే ఇప్పటివరకు ఆయన పార్టీలో చేరకపోవడం, టికెట్టుకు దరఖాస్తు చేసుకోకపోవడంతో ఆయన పార్టీలో చేరికపై సందిగ్ధం నెలకొంది.

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం.. వచ్చిన దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా విభజించి, జాబితాలను రూపొందించింది. ఆయా జాబితాలను పార్టీ ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ చేతికి అందించారు.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంనుంచి ఇద్దరు, ఎల్లారెడ్డి నుంచి నలుగురు, బాన్సువాడలో 16 మంది, జుక్కల్ నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ జాబితాను పీఈసీ పరిశీలించి, మూడు రోజుల్లో ఒక్కో నియోజకవర్గంనుంచి ముగ్గురు ఆశావహులతో మరో జాబితా రూపొందించనుంది. పీఈసీ వచ్చే నెల 2న మరోసారి సమావేశమై, ముగ్గురి పేర్లతో రూపొందించిన జాబితాపై చర్చించనుంది. అనంతరం ఆ జాబితాను హైకమాండ్‌కు పంపించనుంది. సామాజిక వర్గాలు, దరఖాస్తుదారుల బలాబలాల ఆధారంగా సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేయనుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బాన్సువాడ, జుక్కల్‌లలో పోటాపోటీగా..

కాంగ్రెస్ పార్టీలో బాన్సువాడ టికెట్టు కోసం తీవ్ర పోటీ ఉంది. ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి 16 మంది కాంగ్రెస్ నేతలు ఆసక్తి చూపారు. వీరిలో కొందరు దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్లు, వారి తనయులు ఉన్నారు. ముగ్గురి పేర్లతో రూపొందించే జాబితాలో ఎవరి పేర్లు ఉంటాయన్న దానిపై ఆసక్తి నెలకొంది.

జుక్కల్ నియోజకవర్గంలోనూ ఎనిమిది మంది పార్టీ టికెట్టుకోసం దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగారాంతో పాటు పలువురు నేతలు టికెట్టు ఆశిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. అయితే ప్రజల్లో ఉన్న పలుకుబడి, బలాబలాలను పరిశీలించి సరైన వారికే టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది. దీంతో టికెట్టు ఎవరికి వస్తుందన్న దానిపై ఆ పార్టీలో తీవ్ర చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తోంది వీరే..

ఎల్లారెడ్డి నియోజకవర్గం	
మదన్‌మోహన్‌రావు	దమ్మన్నగారి రాజేశ్వర్‌రెడ్డి
వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి	ఆకుల శ్రీనివాస్

కామారెడ్డి నియోజకవర్గం	
షబ్బీర్ అలీ	కానుగంటి రాజు

బాన్సువాడ నియోజకవర్గం	
కాసుల బాలరాజు	రమావత్ అంబర్‌సింగ్
మాసాని అనిల్‌కుమార్‌రెడ్డి	ఇందూర్ చంద్రశేఖర్
కొడాలి సురేశ్	మాసాని శ్రీనివాస్‌రెడ్డి
శ్రీనివాస్‌గౌడ్	బొప్పిడి వెంకట్రాంరెడ్డి
కేతావత్ మోతీలాల్	ముత్తారెడ్డి రాజారెడ్డి
పుప్పాల శంకర్	కె.అజయ్‌కుమార్
రెడ్డిగారి జ్యోతిర్మయిరెడ్డి	కొత్త సోమశేఖర్‌రావు
యలమంచిలి శ్రీనివాస్‌రావు	మెగావత్ ప్రతాప్‌సింగ్

జుక్కల్ నియోజకవర్గం
సౌదాగర్ గంగారాం
తోట లక్ష్మీకాంతరావు
గైక్వాడ్ విద్య
గడుగు గంగాధర్
అయ్యల సంతోష్
సీమ గంగారాం
మోరె కిషన్
దండెం లలిత్ కుమార్

వెదురు మొక్కల ఉత్పత్తికి శ్రీకారం!

- 'మాల్తుమ్మెద'లో మామిడికి బదులుగా ప్రత్యామ్నాయ ప్రణాళిక
- 18 వేల మొక్కల ఉత్పత్తి లక్ష్యం

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మామిడిమొక్కల ఉత్పత్తికి బదులుగా వెదురు మొక్కల ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నారు. ఉద్యాన క్షేత్రంలోని బోర్లలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో మామిడి మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో ఉత్పత్తి చేసిన మామిడి మొక్కలలో సైతం ఎదుగుదల లోపించింది. దీంతో ఈ ఏడాది మామిడి మొక్కలకు బదులుగా వెదురు మొక్కలను ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది 18 వేల వెదురు మొక్కలు ఉత్పత్తి చేయాలని నిర్ణయించి, ఒక్కో మొక్కకు రూ.15 చొప్పున నిధులు మంజూరు చేశారు. మొక్కల ఉత్పత్తి కోసం మట్టి తరలింపు, విత్తనాల కొనుగోలు తదితర పనులు చేపట్టనున్నారు. దీంతో పాటు క్షేత్రంలో మరో 5 వేల శ్రీగంధం మొక్కలను ఉత్పత్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.



క్షేత్ర భూముల లీజు రద్దు!

ఉద్యాన క్షేత్రంలోని 15 ఎకరాల భూమిని గతేడాది ఓ వ్యక్తికి ఏడాదిపాటు లీజుకు ఇచ్చారు. సదరు వ్యక్తి ఎకరాకు రూ.15 వేల చొప్పున చెల్లించాడు. లీజుకు తీసుకున్న భూమిలో కూరగాయలతోపాటు మొక్కజొన్న సాగుచేసి ఆదాయం పొందాడు. వచ్చేనెల రెండో వారంలో లీజు ముగియనుంది. ఈ నేపథ్యంలో క్షేత్రభూముల లీజు ప్రక్రియను రద్దు చేసి, ఉద్యాన క్షేత్రం ఆధ్వర్యంలోనే వివిధ రకాల పంటలను సాగుచేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రయోగాలు ఫలిస్తే ఉద్యాన క్షేత్రం రూపరేఖలు మారతాయని స్థానికులు భావిస్తున్నారు.

త్వరలో కల్వకుంట్ల దుకాణం బంద్



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు: అసెంబ్లీ ఎన్నికల తర్వాత కల్వకుంట్ల కుటుంబ దుకాణం పూర్తిగా బంద్ అవుతుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం భిక్కనూరుకు చెందిన గిద్ద దళితులు కాంగ్రెస్‌లో చేరారు. షబ్బీర్ అలీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గజ్వేల్ ప్రజలు ఛీకొడతారన్న ఉద్దేశంతోనే కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో 80 నుంచి 90 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నేతలు లింబాద్రి, సిద్దగౌడ్, సాజిద్, స్వామి, రవి శ్రీనివాస్, మద్దూరి రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోవాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్: గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగులందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో దివ్యాంగులకు పెరిగిన పెన్షన్ ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో సుమారు 18 వేల మంది దివ్యాంగులకు ఆసరా పెన్షన్ అందిస్తున్నామన్నారు. నస్రుల్లాబాద్ మండలంలో 513 మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరుతోందన్నారు. దివ్యంగులు ఇల్లు నిర్మించుకుంటే గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు అందేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా నస్రుల్లాబాద్‌కు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి ప్రతాప్ సింగ్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మాజీద్‌ఖాన్, నాయకులు కంది మల్లేష్, మైశాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, కిషోర్ యాదవ్, రాము, వెంకటి, మంగలి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ఆటలపై అవగాహనకు 'చలో మైదాన్'
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చాంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని కళాభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రోజులో కనీసం అరగంట సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. యువతలో క్రీడలపై అవగాహన కలిగించడానికి, వారిని ప్రోత్సహించడానికి చలో మైదాన్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశలోనే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. లేకపోతే తర్వాత ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టేందుకు సమయం దొరకదన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండినవారందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, పరీక్షల విభాగం సహాయ సంచాలకుడు లింగం, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లిక్కర్ టూరిస్ట్ ఎవరో తెలుసు

- కల్వకుంట్ల కుటుంబమంతా వచ్చినా ఓడిస్తాం
- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ఢిల్లీలో లిక్కర్ స్కాం చేసిందెవరో దేశమంతటికి తెలుసని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాయకులు పొలిటికల్ టూరిస్టులు అయితే నువ్వు లిక్కర్ టూరిస్టువా" అని ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించారు. మహారాష్ట్రలో సభలు పెడుతున్న సీఎం కేసీఆర్ ఏ టూరిస్టో చెప్పాలన్నారు. "ఒక చేతిలో బతుకమ్మ, మరో చేతిలో లిక్కర్ పట్టుకున్నావు" అంటూ ఎమ్మెల్సీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. నిజామాబాద్ జిల్లాలో తన ఆధిపత్యంతో ఎమ్మెల్యేలను కవిత డమ్మీలు చేశారని, ఎంపీ ఎన్నికలలో ఆమె ఓడిపోయినందుకు అదే ఎమ్మెల్యేలు పూజలు చేశారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడనీయకుండా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను అవమానించిన ఘనత కవితదన్నారు. కామారెడ్డిలో కవిత కోసమే సీఎం కేసీఆర్ దస్తీ వేశారన్నారు. కామారెడ్డికి మొత్తం కల్వకుంట్ల కుటుంబమంతా వచ్చినా బీజేపీ ఓడిస్తుందన్నారు.

సెప్టెంబర్ 1న చలో గజ్వేల్

సీఎం వస్తే కామారెడ్డి అభివృద్ధి చెందుతుందనే వారికి వెంకటరమణారెడ్డి సవాల్ విసిరారు. గజ్వేల్‌లో ఏం అభివృద్ధి జరిగిందో తేల్చేందుకు శుక్రవారం చలో గజ్వేల్‌కు పిలుపునిస్తున్నామన్నారు. వంద బస్సులు పెడతానని, అక్కడ ఏం అభివృద్ధి అయ్యిందో ప్రజలకు చూపిస్తానని పేర్కొన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూబాధితుల ఆర్తనాదాలనూ వినిపిస్తానన్నారు.

కామారెడ్డిలోని సిరి వెంచర్‌లో 100 ఎకరాల భూమి కవిత బినామీల పేరిట ఉందని లోకం కోడై కూస్తోందని వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల భూములు ఎవరు అమ్మారో.. ఎవరు కొన్నారో తేలుద్దామా అని కవితకు సవాల్ విసిరారు. తన ప్రాణం ఉన్నంత వరకు కళాశాలకు చెందిన ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వనన్నారు. కవితను చెల్లిగా భావిస్తున్నానని, ఇక్కడికి వచ్చి కామారెడ్డి ప్రజల్ని మోసం చేయవద్దని కోరారు. తనపై తప్పుడు వార్తలు ప్రచురించిన ఓ పత్రికకు కోర్టు సమన్లు పంపినట్లు తెలిపారు. వాస్తవాలు రాయాలని, తనది తప్పయితే ముక్కు నేలకు రాస్తానని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు రవి, శ్రీనివాస్, పండ్ల ప్రవీణ్, నరేందర్, విపుల్ తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే నెలాఖరులోగా మిల్లింగ్ పూర్తి చేయాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: సీఎంఆర్ లక్ష్యాన్ని వచ్చేనెలాఖరులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ రైస్ మిల్లర్లకు సూచించారు. 15 శాతం లోపు ధాన్యం నిల్వ ఉన్న ఉన్న రైస్‌మిల్లర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లకు కేటాయించిన వానాకాలం ధాన్యం మిల్లింగ్‌ను పూర్తి చేయకపోతే మరో రైస్‌మిల్‌కు మారుస్తామన్నారు. లక్ష్యం పూర్తి చేయని రైస్ మిల్లులకు 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం ఇవ్వబోమన్నారు. సమావేశంలో డీఏస్‌వో మల్లికార్జున్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడి

కామారెడ్డి టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ. 18 వేల కనీస వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లను పరిష్కరించని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో ఆశా కార్యకర్తలు ఇంద్ర, రాజశ్రీ, పద్మ, మమత, సంగీత, స్వరూప, శారద, అనిత, జ్యోతి, కమల తదితరులు పాల్గొన్నారు.



గంప గోవర్ధన్ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

క్లుప్తంగా

ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన జాన్కంపేట్ వాసి



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన సొడ సవీన్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ ఉద్యోగోన్నతి ఉత్తర్వును సవీన్‌కు మంగళవారం అందజేశారు. సవీన్ ఉద్యోగోన్నతి పొందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే అండర్ పాస్ ప్రాంతాల పరిశీలన



నవీపేట: మండలంలోని మూడు రైల్వే గేట్ల సమీపంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణాలకు అధికారులు మంగళవారం ప్రాంతాలను పరిశీలించారు. రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవిప్రకాశ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, రోడ్డు భవనాల శాఖ ఈఈ సురేశ్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలన చేపట్టారు. మండలంలోని మహంతం, ధర్యాపూర్, ధర్మారం ప్రాంతాల్లోని రైల్వేగేట్లను పరిశీలించారు. రైళ్ల రాకపోకలు, వాహనాల రద్దీ పెరగడంతో అధికారులు ఈ నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించారు. వీరి వెంట డీఈఈ రామ్మోహన్, గిర్దావర్ మోహన్, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఆర్మీ జవాన్ ప్రశాంత్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. బ్రెయిన్ ట్యూమర్‌తో కోల్‌కతా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ప్రశాంత్ మృతదేహానికి ఆర్మీ సిబ్బంది సైనిక వందనం చేసి అంత్యక్రియలు చేపట్టారు. అంత్యక్రియల్లో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకుడు జగన్నాథ్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. 122మంది మహిళలకు ఆరోగ్య, 14 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వైద్యులు స్రవంతి, మానస, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ చరణ్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్..

- స్కీం సభ్యులకు బహుమతులు, డబ్బులు వాపసు ఇవ్వని నిర్వాహకులు
- దొన్కల్‌లోనే బాధితుల సంఖ్య వందకు మించిన వైనం
- గతంలో పక్షం రోజుల గడువు ఇచ్చిన మంత్రి



స్కీంకు సంబంధించిన బ్రోచర్

మోర్తాడ్(బాల్కొండ): స్కీంల స్కాంకు సంబంధించి సభ్యులైన వారికి బహుమతులు లేదా సొమ్ము వాపసు ఇవ్వాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించినా నిర్వాహకులు పెడచెవిన పెట్టడంతో స్కీం సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2020లో మొదలైన స్కీం 2021లో ముగిసిపోయింది. డ్రాలో పెద్ద బహుమతులు పొందిన సభ్యులకు లబ్ధి జరుగగా చివరి వరకు ఎలాంటి బహుమతి గెలుచుకోని వారికి స్కీం నిర్వాహకులు ముందుగా ప్రకటించిన ప్రకారం ఏదో ఒక బహుమతి ఇవ్వాల్సి ఉంది. 15 నెలల స్కీంకు చివరి వరకు ఉన్న సభ్యుడు నెలకు రూ.1,500ల చొప్పున మొత్తం రూ.22,500లు చెల్లించాడు. ఇలా చివరి వరకు ఉన్న సభ్యులకు ప్లాస్మా టీవీ లేదా రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్లలో ఏదో ఒకటి ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రతి వస్తువు ధర రూ.10వేల లోపు ఉంది. అంటే చివరి వరకు ఉన్న సభ్యుడు ఎక్కువ మొత్తంలోనే నష్టపోతున్నాడు. స్కీం ముగిసి రెండేండ్లు గడిచినా సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం, డబ్బు వాపసు చేయకపోవడంతో నిర్వాహకుల బండారం బయటపడింది. దొన్కల్ కేంద్రంగా సాగిన స్కీంలో ఈ గ్రామానికి చెందినవారే ఎక్కువ మంది బాధితులు ఉన్నారు. ఇప్పటికీ కొంత మందికి స్కీం సొమ్ము, బహుమతులు ఇవ్వగా ఇంకా 100 మందికి మించి బహుమతులను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ నిర్వాహకులు మాత్రం మంత్రి ఇచ్చిన గడువు ముగిసిపోయినా ఇంకా బహుమతులు, సొమ్ము వాపసు ఇవ్వడం లేదు. స్కీంల స్కాంతో అధికార పార్టీకి అంటిన మరకను తుడిచివేయడానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి మోర్తాడ్ జడ్పీటీసీ సభ్యుడు బద్దం రవికి బాధ్యతలు అప్పగించారు. జడ్పీటీసీ సభ్యుడు నిర్వాహకులతో మాట్లాడి బాధితుల బహుమతులు, స్కీం డబ్బుల వాపసు ఇప్పించాల్సి ఉంది. తమ గ్రామంలో తాము బహుమతులు ఇచ్చుకుంటామని జడ్పీటీసీ సభ్యుడిని నమ్మించి తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందరికీ డబ్బులు లేదా బహుమతులు ఇచ్చేశామని నమ్మించిన నిర్వాహకులు తమ బాధ్యత తీరిపోయిందనే ధీమాతో ఉన్నారు. కానీ స్కీంల బాధితులు మాత్రం ఒక్కొక్కరు బహిరంగం అవుతున్నారు. మంత్రి చెప్పినా మాటను స్కీం నిర్వాహకులు లెక్క చేయకపోవడంపై ఆగ్రహంతో ఉన్న సభ్యులు పోలీసులను ఆశ్రయించాలని చూస్తున్నారు. ఏది ఏమైనా స్కీంల స్కాంతో అధికార పార్టీకి మాయని మచ్చ ఏర్పడిందని చెప్పొచ్చు.

క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం



బాన్సువాడలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ మినీస్టేడియంలో క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఖోఖో పోటీలు నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసిన స్పీకర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ ప్రతిష్టతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ధ్యాన్‌చంద్‌కు తనశ్రద్ధాంజలి అని, విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే అని అన్నారు. క్రీడలతో శారీరక, మానసికంగా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని అన్నారు. బాన్సువాడలో అన్ని వసతులతో క్రీడాకారుల సౌలభ్యానికి మినీ స్టేడియాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ అంజిరెడ్డి, నాయకులు ఎజాస్, కృష్ణారెడ్డి, పాతబాలకృష్ణ, మోహన్‌నాయక్, జుబేర్, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, నిర్వాహకుడు నరేశ్, పీఈటీలు దాసరి అనిల్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్



ఎల్లారెడ్డిలో కేసీఆర్ చిత్ర పటానికి దివ్యాంగులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం కేసీఆర్ మార్గదర్శకం చేశారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు పెన్షన్ల పెంపు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వికలాంగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి దివ్యాంగులకు పెరిగిన పెన్షన్ పత్రాలను అందజేశారు. అనంతరం దివ్యాంగులకు భోజనాన్ని వడ్డించి వారికి మజ్జిగను తాగించారు. వికలాంగులపై చిన్న చూపు ఉన్న వారికి సీఎం కేసీఆర్ కనువిప్పు కల్పించేలా చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు మాధవి, దశరథ్ రెడ్డి, జడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట ఎంపీడీవోలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇబ్బందికరంగా ప్రవర్తించిన పలువురు ఆశావర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు.

ట్రాన్స్‌కో అధికారుల సేవలు భేష్



అధికారులను సన్మానిస్తున్న రైతులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో వ్యవసాయ భూముల వద్దకు కరెంట్ సరఫరా వచ్చేలా చేసిన ట్రాన్స్‌కో అధికారులకు రైతులు అభినందనలు తెలిపారు. రైతుల కోరిక మేరకు ట్రాన్స్‌కో డీఈ నరేశ్, ఏఈ ధర్మారెడ్డిలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అధికారుల ప్రత్యేక చొరవతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించిందని రైతులు పేర్కొన్నారు. లైన్‌మన్ బాబు, మాజీ ఉప సర్పంచ్ దాకయ్య పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై, తహసీల్దార్

ఖలీల్‌వాడి: నిర్మల్ నుంచి తీసుకొచ్చిన గంజాయిని విక్రయించడానికి ప్యాకెట్లు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు. నగరంలోని బర్కత్‌పురకాలనీకి చెందిన షేక్ అఫ్రోజ్, దారుగల్లీకి చెందిన సయ్యద్‌జరీనా గంజాయి విక్రయించేందుకు ప్యాకెట్లను తయారు చేస్తున్నట్లు తెలిపారు. షేక్ అఫ్రోజ్ నిర్మల్ నుంచి 6 కిలోల గంజాయిని తీసుకొచ్చి సయ్యద్ జరీనా ఇంట్లో దాచిపెట్టాడు. ఇరువురు గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో నింపి విక్రయించేందుకు ప్యాక్ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. సౌత్ తహసీల్దార్ బాలరాజు సమక్షంలో పంచనామా నిర్వహించారు. గంజాయి విలువ రూ.13,750 ఉంటుందని పేర్కొన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

మద్యం దుకాణదారునితో సర్పంచ్ వాగ్వాదం



బీబీపేట: మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్‌లో తనకు కావాల్సిన మద్యం లేదని చెప్పిన వైన్స్ యజమానిపై ఉప్పరపల్లి సర్పంచ్ ప్రసాద్ మంగళవారం వాగ్వాదపడ్డాడు. దుకాణ సిబ్బంది ఎంత సముదాయించినా వినిపించుకోకుండా వైన్స్ షెట్టర్‌ను బలవంతంగా మూసేశాడు. అప్పటికే సర్ది చెప్పడానికి ప్రయత్నించిన సిబ్బందిపై దూషించాడు. సర్పంచ్ తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

టీయూ బీసీ బోధనేతర సిబ్బందికి రాష్ట్ర సంఘంలో చోటు



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘంలో టీయూ బోధనేతర సిబ్బందికి చోటు లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, ఏఈ వినోద్, సూపరింటెండెంట్ బి.భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాయాగౌడ్, వినోద్, భాస్కర్‌కు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు నాగరాజు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

దోమకొండలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



దోమకొండ: మండల కేంద్రంలోని ముత్యంపేట రోడ్డులో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలను మంగళవారం చేపట్టారు. వాహనదారులకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులపై జరిమానా విధించారు. కానిస్టేబుళ్లు సంజీవ్, సాయిలు, సామ్రాట్, వెంకటేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ స్థాయి క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్: క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో రాణించాలని డీఈవో ఎస్.రాజు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా హాకీ అసోసియేషన్, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న హాకీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చదువులతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర, జాతీయ, ప్రపంచస్థాయిలో క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. హాకీలో విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు నీల లింగం, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రతినిధులు తదితరులున్నారు.

కనీస వేతనం చెల్లించాలని ఆశావర్కర్ల ఆందోళనలు



బిచ్కుందలో ఆశావర్కర్లను అడ్డుకుంటున్న పోలీసులు



రాజంపేట పోలీస్ స్టేషన్‌లో ఆశావర్కర్లు



నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో..

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. ఆశావర్కర్లు అందరూ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. పోలీసులు ఎక్కడికక్కడ వారి ర్యాలీలను అడ్డుకున్నారు. కొందరిని స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు తరలించి అనంతరం విడిచిపెట్టారు. బిచ్కుందలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఇంటిని, బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. అనంతరం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ..కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



బాన్సువాడలో స్పీకర్ ఇంటి ఎదుట ధర్నా చేస్తూ..

ఉద్యోగ భద్రత కల్పించండి



సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అంబీర్ మనోహర్



మద్దతు తెలుపుతున్న టీపీటీఎఫ్ నాయకులు

కామారెడ్డి రూరల్/కామారెడ్డి టౌన్/లింగంపేట:రెగ్యులరైజ్ చేసేంతవరకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు చేస్తూ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించి ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను ఇప్పటికీ నమ్ముతున్నామని వారు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో దీక్షలు చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్, పీఆర్‌టీయూ నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం , విద్యాశాఖ స్పందించి తక్షణమే ఉద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. టీపీటీఎఫ్ నేతలు అనిల్‌కుమార్, నళినీదేవి ఉన్నారు.

ఇద్దరు నిందితుల రిమాండ్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముల్లంగి(బి) గ్రామానికి చెందిన బొల్లారం నవీన్ బర్ధీపూర్ శివారులోని మహీంద్ర షోరూంలో పని చేస్తున్నాడు. జూలై 4న ఎప్పటిలాగే షోరూం ఎదుట బైక్‌ను పార్క్ చేశాడు. కొద్దిసేపటికి వచ్చి చూడగా బైక్ కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డిచ్‌పల్లి సీఐ కె.కృష్ణ, ఎస్సై యు.మహేశ్‌లు టెక్నాలజీ సాయంతో చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి కేసును చేధించారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వైపు అనుమానస్పదంగా నంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఇద్దరు వెళ్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. రెంజల్ మండలం కందకుర్తికి చెందిన అలీం బేగ్, మీర్జా మునావర్ బేగ్, నగరానికి చెందిన హాకీఫ్ కలిసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మద్యం దుకాణాల ఎదుట నిలిపి ఉంచిన బైక్‌లకు నకిలీ తాళం వేసి దొంగిలిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే చోరీ చేసిన బైక్‌ను గుర్తు పట్టకుండా నంబర్ ప్లేట్ తొలగించి, బండి ఇంజిన్, చాసిస్ నంబర్లను బండరాయితో పూర్తిగా తొలగిస్తామని నిందితులు అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 17 బైక్‌లను స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మరో నిందితుడు హాకీఫ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ బైక్‌లను పార్కింగ్ ఏరియాలోనే నిలిపి ఉంచాలని సూచించారు. కేసును చేధించిన సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, సర్దార్, లింగం, సుధాకర్, రాము, సతీశ్, సందీప్, శ్రీనివాస్‌లను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం కార్నర్

మూడు రోజుల వ్యవధిలో తల్లీ, కొడుకుల మృతి



ద్యావరి రాజవ్వ (ఫైల్)



ద్యావరి సిద్ధిరాములు (ఫైల్)

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో విషాదం చోటుచేసుకుంది. మూడు రోజుల వ్యవధిలో తల్లీ, కుమారుడు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ద్యావరి సిద్ధిరాములు (58) వ్యవసాయం చేసేవాడు. అతడు అనారోగ్యానికి గురికావడంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతని తల్లి ద్యావరి రాజవ్వ (85) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధిరాములు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో తల్లీకొడుకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



రామారెడ్డి: రామారెడ్డి మండలం జగదంబ తండాలో గంగావత్‌రాజు నాయక్ చెందిన ఆవు మంగళవారం మృతి చెందింది. తమ పంట పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ఆవు విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష

ఖలీల్‌వాడి: మద్యం సేవించి బైక్ నడిపిన గోకుల్‌రాజ్‌కు నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ రెండు రోజుల జైలుశిక్షను మంగళవారం విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన గోకుల్‌రాజ్ జిల్లా కేంద్రంలో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నగరంలోని కుమార్‌గల్లీలో పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు గోకుల్‌రాజ్ మద్యం సేవించినట్లు రుజువు కావడంతో కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తాగినట్లు ఒప్పుకోవడంతో జడ్జి రెండు రోజుల జైలుశిక్షను విధించారు.

తండ్రిని చంపిన తనయుడికి ఏడేళ్ల జైలుశిక్ష

ఖలీల్‌వాడి: కన్నతండ్రిని చంపిన తనయుడికి ఏడేండ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తున్నట్లు నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిచపల్లి మండల కేంద్రానికి చెందిన వాహేద్‌ఖాన్‌కు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరికీ వివాహాలు చేసిన వాహేద్‌ఖాన్ డిచ్‌పల్లిలోని ఓ మడిగెలో చికెన్‌సెంటర్, పంక్చర్ షాప్ నిర్వహిస్తున్నాడు. పెద్ద కుమారుడు అఫ్సర్‌ఖాన్ మద్యానికి బానిసై నిత్యం తండ్రిని డబ్బులు కావాలని వేధించేవాడు. అఫ్సర్‌ఖాన్ పెడుతున్న బాధలను తట్టుకోలేక అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. 2020మే26న తన తండ్రితో మద్యం డబ్బులు కావాలని అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని చెప్పిన తండ్రితో గొడవపడ్డాడు. కమ్మకత్తితో తండ్రిని చంపబోయాడు. షాప్‌లో ఉన్న పంపును అడ్డుగా పెట్టుకున్నా తండ్రి చేతులు, మెడ, తల, గొంతుపై అఫ్సర్ తీవ్రంగా గాయపర్చాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేసిన నేరాలు రుజువు కావడంతో జడ్జి నిందితుడినిక ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమానా విధించింది.

పలువురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కు లాస్‌పూర్ తండాలో ఆరుగురు, మోపాల్‌లో ఐదుగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. కులాస్‌పూర్ అటవీప్రాంతంలో చెట్లను నరికేసినట్లు గుర్తించిన ఎఫ్ఆర్‌వో రామేశ్వర్‌రెడ్డి తండాకు చెందిన ఆరుగురిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మోపాల్ మండల శివారు లో ఏడీ సర్వే చూయించిన భూమిలో హద్దులు ఏ ర్పాటు చేసుకుంటున్న భూమయ్యను బెదిరించిన ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హద్దులు తొలగించడమే కాకుండా బెదిరింపులకు గురిచేశారని భూమయ్య ఫిర్యాదు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరిపై కేసు

వర్ని: మండలంలోని రూపులా నాయక్ తండా, సక్రియ నాయక్ తండాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ గన్ను మంగళవారం తెలిపారు. స్పెషల్ పార్టీ అధికారులు తండాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.